بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 31.05.2019 (Telugu)**

## జుమా నమాజ్ కొరకు పిలిచినప్పుడు ఎలాంటి అలసత్వము చూపకుండా తక్షణమే శ్రద్ధ వహించుచు ఎన్ని పనులున్నా జుమా నమాజ్ కొరకు హాజరు కావలెనని అల్లాహ్ తఆలా స్పష్టము చేసెను

**జుమా నమాజ్ సలుపుట, ఇమామ్ ఖుత్బా వినుట మీ కొరకు మీ వ్యాపారములు, లావాదేవీలు, ప్రాపంచిక పనుల కంటే వేలాది, లక్షలాది రెట్లు ఎక్కువ మేలైనది**

**కావున మన ప్రార్థన ప్రమాణములను పెంచుకొనుట, ఈ రమజాన్‌లో ఎంతటి ప్రమాణములను మనము అందుకున్నామో లేదా అందుకొనుటకు ప్రయత్నించినామో అవి పడిపోకుండా చూసుకొనుట మన కర్తవ్యము**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 31.05.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ మోర్డన్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ జుమా అధ్యాయములోని చివరి సూక్తులను పఠించి, వాటి అనువాదము వినిపించిరి.

يٰۤاَيُّهَا الَّذِيۡنَ اٰمَنُوۡۤا اِذَا نُوۡدِىَ لِلصَّلٰوةِ مِنۡ يَّوۡمِ الۡجُمُعَةِ فَاسۡعَوۡا اِلٰى ذِكۡرِ اللّٰهِ وَذَرُوا الۡبَيۡعَ‌ ؕ ذٰ لِكُمۡ خَيۡرٌ لَّـكُمۡ اِنۡ كُنۡتُمۡ تَعۡلَمُوۡنَ ○ فَاِذَا قُضِيَتِ الصَّلٰوةُ فَانۡتَشِرُوۡا فِى الۡاَرۡضِ وَابۡتَغُوۡا مِنۡ فَضۡلِ اللّٰهِ وَاذۡكُرُوا اللّٰهَ كَثِيۡرًا لَّـعَلَّكُمۡ تُفۡلِحُوۡنَ ○ وَاِذَا رَاَوۡا تِجَارَةً اَوۡ لَهۡوَا ۨانْفَضُّوۡۤا اِلَيۡهَا وَتَرَكُوۡكَ قَآئِمًا‌ ؕ قُلۡ مَا عِنۡدَ اللّٰهِ خَيۡرٌ مِّنَ اللَّهۡوِ وَمِنَ التِّجَارَةِ‌ ؕ وَاللّٰهُ خَيۡرُ الرّٰزِقِيۡنَ ○

ఇట్లనిరి. ఈ సూక్తుల అనువాదమిట్లు గలదు. ఓ విశ్వాసులారా! శుక్రవారపు ఒక భాగములో ప్రార్థన నమాజ్ కొరకు పిలువబడినప్పుడు అల్లాహ్ స్తోత్రము వైపు వ్యాపారమును విడిచి శీఘ్రగతిలో పొమ్ము. మీకు తెలిసివున్నచో మీకొరకిది ఉత్తమమైనది. కనుక ప్రార్థనానంతరము భూమిలో వ్యాపించుము. అల్లాహ్ అనుగ్రహములో నుండి కొంత దానిని వెతుకుము. మీరు విజయులగుటకు అల్లాహ్‌ను తరచుగా స్తుతించుము. వారు ఏదేని వ్యాపారముగాని, వినోదమును చూచినప్పుడు దాని వైపు పరుగులు తీయుదురు. నిన్ను ఒంటరిగా వదిలి వేయుదురు. నీవు ఇట్లనుము. అల్లాహ్ వద్ద నున్నది వినోదము, వ్యాపారము కంటే చాలా ఉత్తమమైనది. ఆహారము నొసంగువారిలో అల్లాహ్ అందరికంటే ఉత్తముడు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేడు ఈ రమజాన్‌లోని చివరి శుక్రవారము. సాధారణంగా ప్రజల దృష్టి ఇటు వైపు వున్నందున అధిక సంఖ్యలో ప్రజలు జుమా నమాజ్ కొరకు వస్తుంటారు. ప్రత్యేక శ్రద్ధతో హాజరగుటకు కృషి చేస్తారు. జుమా అధ్యాయములోని చివరి రుకు సూక్తులను నేను పఠించినాను. జుమాల ప్రాముఖ్యత గురించి అల్లాహ్ తఆలా ఇందులో స్పష్టముగా తెలిపెను. కావున జుమాకు హాజరగుట అల్లాహ్ తఆలా దృష్టిలో చాలా ముఖ్యము. జుమా నమాజ్ కొరకు పిలువబడినప్పుడు ఎలాంటి అలసత్వము ప్రదర్శించకుండా ఎంతటి ముఖ్యమైన పనులున్నా జుమా నమాజ్ కొరకు హాజరు కావలెనని అల్లాహ్ తఆలా స్పష్టము చేసెను. వ్యాపారము బాగా సాగే సమయమైనను, లక్షలు, కోట్ల నష్టము వాటిల్లుచున్నను పట్టించుకోకూడదు. ప్రాపంచికపరంగా లక్షల, కోట్ల నష్టము వాటిల్లే అవకాశమున్నను పట్టించుకోకుండా జుమా నమాజ్ కొరకు హాజరు కాగలరు. ఎందుకనగా జుమా నమాజ్ కొరకు వచ్చుట, కేంద్ర మస్‌జిద్‌లో జుమా నమాజ్ సలుపుట, ఇమామ్ ఖుత్బా వినుట మీ కొరకు మీ వ్యాపారముల, వానిజ్యముల, ప్రాపంచిక పనుల కంటే వేలాది, లక్షలాది రెట్లు మేలైనది. కాని దీని గురించి నిజమైన, సరియైన భావన కలిగివున్న వ్యక్తి మాత్రమే దీనిని అర్థము చేసుకోగలడు. నిజమైన భావన కలిగి వున్న వ్యక్తి నిశ్చయముగా ఈ వ్యాపారములకు, వానిజ్యములకు ద్వితీయ ప్రాధాన్యతనిచ్చును. జుమా నమాజ్ తర్వాత

మీకు స్వేచ్ఛ గలదని కూడ అల్లాహ్ తఆలా వెంటనే సూచించెను. నిస్సందేహంగా మీ ప్రాపంచిక పనులు, వ్యాపారములలో నిమగ్నము కావచ్చును. అల్లాహ్ తఆలా మీ ప్రాపంచిక పనులలో కూడ శుభము కలిగించును. కాని తమ ప్రార్థనలను జుమా వరకు మాత్రమే పరిమితం చేయకూడదు. అల్లాహ్ తఆలాను మీరు అనుక్షణం గుర్తు చేసుకోవలెను. అల్లాహ్ తఆలా స్తోత్రము వైపు దృష్టి సారించినప్పుడు అల్లాహ్ తఆలా మీకు గతము కంటే ఎక్కువ ధార్మిక, ఆధ్యాత్మిక, ప్రాపంచిక విజయములు లభించును. అల్లాహ్ తఆలాను స్తుతించువారు అల్లాహ్ తఆలాను గుర్తు చేసుకున్నప్పుడు జుమా నమాజ్ తర్వాత మేము అసర్ నమాజ్ కూడ చదవవలెను, ఇది కూడ మా కర్తవ్యములలో ఒకటి, మగ్రిబ్ నమాజ్ కూడ చదవవలెను, అనంతరం ఇషా నమాజ్ కూడ చదవవలెను, ఈ నమాజులు కూడ తప్పనిసరి అని గుర్తు పెట్టుకుంటారు. ప్రాపంచిక వ్యాపారములు లేదా ఇతర వరములన్నియు అల్లాహ్ తఆలా దయతోనే లభించును. కావున విజయమనేది అల్లాహ్ తఆలా స్మరణ, అతని ప్రార్థనతో ముడిపడివున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట జుమా ప్రాముఖ్యతను తెలుపుచు ఇట్లనిరి.

జుమా రోజు పండుగ రోజు. ఈ పండుగ ఇతర పండుగల కంటే ఉత్తమమైనది. ఈ పండుగ కొరకు జుమా అధ్యాయము ప్రత్యేకంగా అవతరించినది. అనంతరం వారు జుమా ప్రాధాన్యతను తెలుపుచు ఇట్లనిరి. హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్హు–ఒక యూదుని మధ్య జరిగిన సంభాషణను కూడ వారిట్లు తెలిపిరి. اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ అను సూక్తి అవతరించినప్పుడు ఈ సూక్తి మా కొరకు అవతరించినచో మేము ఆ రోజును పండుగగా జరుపుకొనేవారమని ఒక యూదుడు అనెను. బదులుగా జుమా పండుగయే. ఈ సూక్తి జుమా రోజున అవతరించినదని హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్హు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. చాలా మందికి ఈ పండుగ గురించి తెలియనే తెలియదు. ఇందులో ధర్మము పూర్తి అయినట్లు వార్త అందించబడెను. తన వరములను సంపూర్ణము చేసినట్లు అల్లాహ్ తఆలా శుభవార్త నందించెను. కాని ఈ రోజుకు ఇంతగా ప్రాముఖ్యత ఇవ్వబడదు. రమజాన్‌లోని చివరి జుమాలో ప్రత్యేక శ్రద్ధతో పాల్గొని ఇతర జుమాలన్నిటి పుణ్యము పొందగలమని భావిస్తారు. కావున చాలా తపనతో తమ జుమాలను రక్షించుకోవలెను. రమజాన్ చివరి జుమాకు ఇచ్చినంత ప్రాధాన్యత సంవత్సరములోని మిగతా జుమాలన్నిటికి ఇవ్వవలసిన అవసరమున్నది. కాని చాలా మంది ఇటువైపు శ్రద్ధ వహించరు. తమ ప్రాపంచిక వ్యాపారములు, ప్రాపంచిక ఆసక్తులలో మునిగి తమ జుమాను కోల్పోతారు. అల్లాహ్ తఆలా వద్ద నున్నది ఈ ప్రాపంచిక వస్తువులు, ధనము, ఆసక్తుల కంటే చాలా గొప్పదని అల్లాహ్ తఆలా తెలిపెను. కనుక ఇది చాలా ముఖ్యమైన, ప్రతి విశ్వాసి దృష్టి సారించాల్సిన విషయమిది. ఈ కాలపు ఇమామ్‌ను విశ్వసించే మనము ఇటువైపు ప్రత్యేక దృష్టి సారించవలసిన అవసరమున్నది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి. అల్లాహ్ తఆలా శాశ్వత జీవితము కొరకు ఏర్పాటు చేసిన చెలిమ సమీపమునకు మీరు చేరుకున్న విషయము నిజమే. కాని దాహము తీర్చుకొనుట ఇంకా మిగిలే వున్నది. మీ దాహమును ఆ నీటితో అల్లాహ్ తఆలా తన కరుణ, దయతో తీర్చవలెనని మీరు ప్రార్థించగలరు. అల్లాహ్ తఆలా కరుణించనిదే ఏమియును లభించదు. ఈ చెలిమ నుండి త్రాగిన వాడు నాశనము కారని నేను నిశ్చయముగా చెప్పగలను. అల్లాహ్ తఆలా మీపై మోపిన రెండు హక్కులను సంపూర్ణ రీతిలో చెల్లించండి. వాటిలో ఒకటి అల్లాహ్ తఆలాది కాగా రెండవది ప్రజలది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా హక్కు చెల్లించుటకు అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుట ఎంతో ముఖ్యము. అల్లాహ్ తఆలా ప్రార్థన హక్కులు చెల్లించినామా లేదా అని గమనించుట చాలా ముఖ్యము. అల్లాహ్ తఆలా ఇట్లనెను. وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْاِنْسَ اِلَّا لِيَعْبُدُوْنِ అనగా నేను జిన్నాతులను, మానవులను కేవలం నా ప్రార్థన కొరకే పుట్టించినాను. ఇదొక శాశ్వత కర్మ. మీరు తెలివి తేటలు పొందినప్పటి నుండి తుది శ్వాస వరకు ఆచరించు చుండవలెను. సంవత్సరములోని ఒక్క జుమానే ముఖ్యమని భావించకూడదు. ప్రతి జుమా ముఖ్యమైనదే.

ఒక సందర్భమున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జుమా ప్రాముఖ్యతను సూచించుచు ఇట్లనిరి. అల్లాహ్ తఆలా, ప్రళయ దినమును విశ్వసించే ప్రతి వ్యక్తికి జుమా నమాజ్ చదువుట విధిగాంచెను. కాని రోగి, ప్రయాణికుడు, స్త్రీ, బానిసకు మినహాయింపు గలదు. అనంతరం ఇట్లనిరి. ఆట పాటలు, వ్యాపారము వలన

జుమాను నిర్లక్ష్యమం చేసిన వ్యక్తి పట్ల అల్లాహ్ తఆలా కూడ నిర్లక్ష్యము చేయును. నిశ్చయముగా అల్లాహ్ తఆలా స్వయం పోషకుడు, మహా సంస్తుతికి సమర్థుడు. జుమా రోజున పుణ్యముల శాతం ఎన్నో రెట్లు పెరుగునని కూడ వారు సల్లం తెలిపిరి. అనవసరంగా జుమాను వీడుట గురించి ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం హెచ్చరిక కూడ ఇట్లున్నది. జుమాను అనవసరంగా విడిచిన వ్యక్తి కర్మలలో దాంబికునిగా వ్రాయబడును. అనంతరం ఇట్లనిరి. సోమరితనముతో మూడు జుమాలను వరుసగా విడిచిన వ్యక్తి హృదయమును అల్లాహ్ తఆలా మూసివేయును. ఇదెంతో ఆందోళనకరమైన సందర్భము. ఎందుకనగా మూసివేయబడినప్పుడు పుణ్యముల అవకాశము తగ్గిపోవును. మరో సందర్భమున వారిట్లనిరి. ఒక వ్యక్తి స్వర్గమునకు అర్హుడైనను జుమాలో వెనుకబడి పోవుచు స్వర్గము నుండి దూరముండి పోవును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అనేక సందర్భములలో ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం జుమాలో పాల్గొనాలని ఆదేశించడమే కాక అనవసరంగా జుమాలో పాల్గొనని వారిని హెచ్చరించిరి కూడ. ఎక్కడైనా ఒక్కసారి కూడ రమజాన్ చివరి జుమాను మీరు చదివినచో మీరు క్షమించబడుతారని తెలుపలేదు. ప్రాపంచిక కోరికలు, పనుల కొరకు తమ జుమాలను, నమాజులను కోల్పోవుట కాక ఒక నమాజు నుండి రెండవ నమాజ్ కొరకు తపన పడుచు నిరీక్షించుట, ఒక జుమా నుండి రెండవ జుమా కొరకు ఆత్రుతతో నిరీక్షించుట, ఒక రమజాన్ నుండి రెండవ రమజాన్ కొరకు వ్యాకులతతో నిరీక్షించుట ఒక విశ్వాసి లక్షణమని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిరి. కావున మన ప్రార్థనల గురించి మనము తపన పడవలసిన అవసరమున్నది. అల్లాహ్ తఆలాను పొందుటకు గట్టిగా కృషి చేయాల్సిన అవసరమున్నది. అల్లాహ్ తఆలా నిజమైన స్థాయి, విలువ, గౌరవమును మనము సరిగ్గా గుర్తించలేదని గమనించినచో మనకు స్పష్టమగును. మన దుఆలలో నిలకడ వుండవలెను. మన హృదయములో కేవలం జుమాల కొరకు కాక ఐదు పూటల నమాజుల కొరకు కూడ మస్‌జిదుల వైపు దృష్టి వుండవలెను. నేను చెప్పినట్లు మనకు ఇందులో సరియైన అవగాహన లేనే లేదు. మనము తాత్కాలిక, తక్షణ అవసరము కొరకు ఎక్కువ దృష్టి సారిస్తాము. మనము అల్లాహ్ తఆలాను విస్మరించి అతని ఆదేశముల కంటే ప్రాపంచిక కోరికలకు ప్రాధాన్యతనిచ్చినప్పుడు అల్లాహ్ తఆలా కూడ ఇటువంటి సోమరుల పట్ల నిర్లక్ష్యము వహించునని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిరి. ఒక వ్యక్తి స్వర్గమునకు అర్హుడైనను స్వర్గమును కోల్పోవును. నా వ్యాపారమైనను, నా పనులైనను అల్లాహ్ తఆలా అనుగ్రహముతోనే శుభకరమగునని ఒక విశ్వాసి సదా గుర్తుంచుకోవలెను. అల్లాహ్ తఆలా అనుగ్రహముతో శుభము లభించునప్పుడు మొదట అల్లాహ్ తఆలా హక్కు చెల్లించుటకు ఎందుకు ప్రయత్నించ కూడదు. ఈ సూత్రమును ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవలెను. ఈ విషయమును మనము గుర్తుంచుకున్నచో మన మస్‌జిదులు ఐదు పూటల నమాజులలో కూడ నిండి వుండును. జుమాలలో కూడ నిండి వుండుటయే కాక చిన్నగై పోవును. ఇదే హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ ఉద్దేశము. మన గడిచిన రోజు కంటే ఈనాడు మెరుగైనది కానిచో మనము నిజమైన విశ్వాసులము కాదని హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనకు స్పష్టము చేసిరి. జుమాకు వీడ్కోలు చెప్పటానికి ఇక్కడ మనము గుమికూడదలేదు. తమ పుణ్యములలో, అల్లాహ్ తఆలా ప్రేమలో వేయబడు అడుగును దృఢము చేసేకొనేందుకు, ఇందుకు దుఆ చేయుటకు మనమిక్కడ గుమికూడినాము. ఇకముందు మనము అల్లాహ్ తఆలాతో ప్రేమలో ముందడుగు వేయాలని నేడు మనము ప్రతిజ్ఞ చేయవలెను. ఇన్‌షాఅల్లాహ్. అల్లాహ్ సామీప్య ప్రాముఖ్యత పట్ల ఆసక్తి వున్నప్పుడే, సర్వ శక్తులకు మూలము, చెలిమ అల్లాహ్ తఆలా అని, పనులన్నిటిని ఉత్తమ రీతిలో పూర్తి చేయుటకు ఉత్తమ సాధనమని గుర్తించినప్పుడే ఈ ప్రతిజ్ఞ, ఈ దుఆ చేయగలము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వస్తువుల అవసరము, అవగాహన వలన వాటి విలువ తెలుస్తున్నది. కొందరు తమ ఆలోచన, అవసరమును బట్టి ప్రాముఖ్యతను గుర్తిస్తారు. చిన్న వస్తువులను అన్వేషించుటకు బయలుదేరుతారు కాని చాలా ముఖ్యమైన విషయములు, వస్తువులను విస్మరిస్తారు. ఇలాంటి పనులకు పాల్పడేవారు ప్రపంచములో చాలా మందే వున్నారు. సరైన అవగాహన లేనందున లేదా తెలియక ముఖ్యమైన వస్తువులను వదిలిపెడుతారు. అల్ప వస్తువులను మానవుడు తన కొరకు ప్రధానమని భావించును. మేము దుఆ చేస్తాము, చాలా రోధనతో దుఆ

చేస్తాము కాని ఆమోదించబడదని కొందరు నన్ను అడుగుతారు. వారికి ఈ సూక్తి ఆధారముగా నేనిట్లు సమాధానమిస్తుంటాను. ఈ సూక్తిని నేను రమజాన్ మొదటి ఖుత్బాలో కూడ చదివితిని. ఇక్కడ అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను. నేను నా దాసుల సమీపములోనే వున్నాను. వారి దుఆలను వింటాను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ فَلْيَسْتَجِيبُوا لِي وَلْيُؤْمِنُوا بِي لَعَلَّهُمْ يَرْشُدُونَ హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజి. ఈ సూక్తిని వివరించుచు ఇట్లనిరి. ఇక్కడ దావతద్దాయి అనగా ప్రతి పిలుచువాడు కాదు. అల్లాహ్ తఆలా కొరకు ఉపవాసములుంటూ, ఫర్జ్ నమాజులను సలుపుచు, దైవ స్మరణ చేయుచు, తమ నమాజులు, జుమాలను రక్షించుకొంటూ, రాత్రి పూట వినమ్రతతో అల్లాహ్ తఆలాను పిలుచువారు దావతద్దాయి అనబడుతారు. నిస్సందేహంగా అద్దాయి అనగా ప్రతి పిలుచువాడు కూడ కావచ్చును. కాని ఇక్కడ రమజాన్ ఆధారంగా వచ్చినందున తమ ప్రార్థనలను అల్లాహ్ తఆలా కొరకు ప్రత్యేకం చేయువారే ఇక్కడ ప్రస్తావించబడిరి. వారు తమ ప్రార్థనలను రమజాన్ వరకు పరిమితం చేయరు. వారి ప్రార్థనలు సంవత్సరమంతా కొనసాగుతాయి. వీరు ప్రాపంచిక కోరికల కొరకు దుఆ చేయరు. అల్లాహ్ తఆలాను పొందుటకు దుఆ చేస్తారు. అన్నిటిని మరచి కేవలం నా సామీప్యము కొరకు దుఆ చేసినప్పుడు నేను వారి దుఆలను తప్పక స్వీకరిస్తాను. నన్ను కలిసేందుకు తపన పడేవారిని నేను తప్పక కలుస్తాను. మేమెంతో రోధనతో దుఆ చేసినాము కాని అల్లాహ్ తఆలా ఆమోదించలేదని కొందరు వ్రాస్తారు. నేను మీ ప్రాపంచిక దుఆలన్నిటిని ఆమోదిస్తాను, దుఆలను వింటానని అల్లాహ్ తఆలా ఎక్కడా చెప్పలేదు. కాని పవిత్ర మార్పులు సృష్టించుకొని అల్లాహ్ తఆలాను పొందుటకు, అతనిని కలిసేందుకు దుఃఖముతో మనము దుఆ చేసినచో నేను తప్పక వింటానని అల్లాహ్ తఆలా తెలిపెను. అనంతరం అతనిని నా మిత్రునిగా చేసుకొని నేను అతనికి తోడుగా నిలుస్తాను. అతని కోరికలను పూర్తి చేయుదును, అతని శత్రువుతో యుద్ధము చేయుదును.

మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించినప్పుడు మన ప్రార్థనల ప్రమాణములను పెంచుకొనుట మన కర్తవ్యము. ఈ రమజాన్‌లో ఏ ప్రమాణములకు మనము చేరుకున్నామో లేదా చేరుకొనుటకు ప్రయత్నించినామో అంతకంటే దిగజారకుండా జాగ్రత్తపడుట మన బాధ్యత. తమ నమాజుల ప్రమాణములను కూడ పెంచుకోండి. జుమాలలో కూడ క్రమం తప్పకుండా పాల్గొనండి. అల్లాహ్ తఆలా ఆదేశములను నమ్మవలెను. అల్లాహ్ తఆలాతో అల్లాహ్ తఆలాను పొందుటకు యాచించేవారిలో చేరుటకు సదా కృషి చేయండి. అనగా మాకు అల్లాహ్ తఆలా లభించాలని దుఆ చేయవలెను. మన నమాజులు, ప్రార్థనలు అల్లాహ్ తఆలాతో భేటి అగుటకు ఉపయోగపడవలెను. ఈ ప్రమాణములను పొందుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

........................................................................

........................................................................

........................................................................